క్లుప్తంగా

జీపుజాతను విజయవంతం చేయాలి

కొయ్యూరు: హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని చేపట్టిన జీపుజాతను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు కోరారు. సీలేరు నుంచి ప్రారంభమయ్యే యాత్ర బుధవారం కొయ్యూరు మండలానకు చేరుకుంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం మర్రిపాలెంలో బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. మజ్జివలసలో ఈనెల 27న నిర్వహించనున్న అరణ్య రోదన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీ జేఏసీ డివిజన్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఆదివాసీ జేఏసీ డివిజన్ కమిటీ

చింతూరు: ఆదివాసీ జేఏసీ డివిజన్ కమిటీ సమావేశం ఆదివారం చింతూరులో జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ, రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి సమక్షంలో డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ చైర్మన్‌గా నరేష్, వైస్ చైర్మన్లుగా రాంప్రసాద్, సాయిబాబు, తమ్మయ్య, మల్లయ్య, శేఖర్, శ్రీను, బాబూరావు, ప్రచార కార్యదర్శులుగా శ్రీను, పాయం చంద్రయ్య, సభ్యులుగా రాజు, కన్నారావు, లక్ష్మణ్, లోవరాజు, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏజెన్సీ ఉద్యోగ నియామకాల చట్టం ప్రకటించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి డిసెంబరులో భారీ బహిరంగ సభకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. నాయకులు జోగారావు, సాయి, దేశయ్య, రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



అచ్చిరాజు

కొయ్యూరు: వైఎస్సార్ సీపీ మరింత బలపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శిగా నియమించబడిన గాడి అచ్చిరాజు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ విధానాలను ప్రజల్లోకి సామాజిక మాధ్యమాల ద్వారా తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ చేస్తున్న అరాచక పాలన, తప్పుడు ప్రచారాలను ప్రజలకు మాధ్యమాల ద్వారా వివరిస్తామన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పి.విజయ్‌వెంకట్, అధ్యక్షుడిగా బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాక్షుడిగా కె.మోహన్, కార్యదర్శిగా ఆర్.నాగభూషణం, కోశాధికారిగా జి.కోటిబాబుతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, నాగభూషణంలు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ బలోపేతంతో పాటు జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చూస్తామన్నారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రసాదరావు, మోహన్, ఉదయ్‌కుమార్, సురేష్, కోటిబాబు, శంకర్‌రావు, భాస్కర్‌రావు, అనిల్, పులిరాజు, రాంబాబులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : రంపచోడవరం డివిజన్ గంగవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు జయకృష్ణ పట్నాయక్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లస్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా జయకృష్ణ పట్నాయక్, ఉపాధ్యక్షుడిగా ఉదయ్ శ్రీను, కార్యదర్శిగా మళ్ల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ప్రసాద్ , కోశాధికారికా రమేష్ , గౌరవాధ్యక్ష, సలహాదార్లుగా భాషా, వీరబాబు, శేషాచార్యులులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను మాజీ ఎమ్మెల్యేలు నాగులపల్లి ధనలక్ష్మి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, తదితరులున్నారు.

కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలి

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటల పెంపుదల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బి.పోతురాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కార్మిక చట్టాలు పక్కాగా అమలుచేయాలన్నారు. కార్మికులకు 8 గంటల పనిగంటల విధానాన్ని పెంచి 10 గంటల చేయడంపై చట్ట సవరణ బిల్లులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్మికులను పనిభారం పెంచే విధంగా ప్రభుత్వం చేస్తున్న కుట్ర ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. కార్మికులకు కనీసం వేతం అందజేయాలని, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మిక చట్టాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కార్మికులకు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెరిగిన ధరలను అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులు.. సమస్యల లోగిళ్లు



పాఠశాలకు భవనం మంజూరు చేయాలని ఆందోళన చేస్తున్న పనస గ్రామస్తులు



గూడమాలిపుట్టులో రేకుల షెడ్డులో ఎంపీపీ పాఠశాల



ముక్కిపుట్టులో కారిపోతున్న షెడ్డులో గొడుగులు పట్టుకొని చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

- పాకలే పాఠశాలలు
- మండలంలోని 55 బడులకు భవనాలు లేని వైనం
- కానరాని కనీస సదుపాయాలు
- విద్యార్థుల అవస్థలు
- తల్లిదండ్రుల వినతులు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది.సరైన భవనాలు లేక గిరిజన విద్యార్థులు పాకల్లో ఏర్పాటుచేసిన తరగతుల్లోని బోధన కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మార్చే కార్యక్రమం చేస్తే, నేడు కూటమి ప్రభుత్వం గిరిజన విద్య వ్యవస్థను గాలికి వదిలేసింది. కనీస సౌకర్యాలు లేక గిరిజన విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ముంచంగిపుట్టు మండలంలో 204 పాఠశాలలున్నాయి. ఇందులో 68 పాఠశాలల భవనాలు శిథిలావ్యవస్థలో ఉన్నాయి. 55 పాఠశాలలకు భవనాలు లేవు.శిథిల భవనాల్లో, రేకుల షెడ్లు, పాకల్లోనే చదువులు కొనసాగుతున్నాయి. వానొస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొడులు లేని పాఠశాలలతో వరద నీరు లోపలకు చేరుతుంది.ఈదురు గాలులకు పైకప్పు రేకులు, పాకలు ఎగిరిపోతాయే అనే భయంతో బిక్కుబిక్కుమంటూ గిరిజన చిన్నారులు చదువులు కొనసాగిస్తున్నారు.

చదువుకు దూరమవుతున్న చిన్నారులు

ప్రాథమిక బడుల పరిస్థితితో మారుమూల గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్న దుస్థితి నెలకొంది. విద్యార్థులకు పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.ముఖ్యంగా వర్షకాలంలో బడులకు భవనాలు లేక పాకల్లో, రేకుల షెడ్లులో చదువుకుంటున్న విద్యార్థులు ఇబ్బందులు తట్టుకోలేక పాఠశాలకు రాలేని పరిస్థితి చాలా గ్రామాల్లో నెలకొంటుంది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవు. పాఠశాలకు వెళ్లి ఇబ్బందులు పడేకన్నా ఇంటి వద్దనే ఉంటే మంచిదనే భావన మారుమూల గిరిజన విద్యార్థుల్లో నాటుకు పోతుంది.దీంతో అనేక మంది విద్యార్థులకు చదువుకు దూరమవుతున్నారు.

శ్రమదానంతో తాత్కాలిక షెడ్లు, పాకలు

తమ పిల్లలు చదువు కోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలనే తపన విద్యార్థుల తల్లిదండ్రుల్లో బలంగా ఉండడంతో శ్రమదానం చేసి రేకుల షెడ్లు, పాకలను నిర్మించుకుంటున్నారు. ప్రభుత్వం, అధికారులు వచ్చి పాఠశాలలు నిర్మిస్తారని, ఆశలను వీడి...గ్రామస్తులంతా ఏకమై తమ పిల్లల కోసం చిన్నపాటి షెడ్లు, పాకలను నిర్మించి, అందులోనే తరగతులు జరిగేలా చూస్తున్నారు. మండలంలోని రంగబయలు పంచాయితీ జోడిగుమ్మ పాఠశాలకు తల్లిదండ్రులు శ్రమదానం చేసి రేకుల షెడ్డును నిర్మించారు.కానీ గొడలు లేకపోవడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుమడ పంచాయితీ ముక్కిపుట్టు ఎంపీపీ పాఠశాలకు తల్లిదండ్రులే ఏడాది క్రితం రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ప్రసుత్తం రేకుల షెడ్డు కారిపోతుంది.దీంతో విద్యార్థులు గొడుగులు పట్టుకొని చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో గూడమాలిపుట్టు, లబడపుట్టు, పనస, సుత్తిగూడ, రంగిలిసింగి, బొడ్డగొంది, పేదపేట, తడిగెర తదితర గ్రామాల్లో విద్యార్థుల చదువుల కోసం తల్లిదండ్రులు నిర్మించిన రేకుల షెడ్లు, పాకలలోనే చదువులు కొనసాగుతున్నాయి. పాఠశాలకు భవనాలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమ పిల్లల కోసం పాఠశాల భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించేలా చూడాలని వారు కోరుతున్నారు.



గోడలు లేని ముక్కిపుట్టు పాఠశాల



జోడిగుమ్మ గ్రామంలో పాఠశాల దుస్థితి

ప్రభుత్వం స్పందించాలి



భవనం లేక మా పిల్లలను పాఠశాలకు పంపించడం లేదు.భవనం లేకపోతే ఉపాధ్యాయుడు చదువు ఎక్కడ చెబుతారు. ఎండకు, వానకు, చలికి విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయాలని కోరిన నేటికి స్పందన లేదు.తక్షణమే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేసి, వేగంగా నిర్మించాలి.

– కిల్లో బుద్రి, దొరగూడ గ్రామం, ముంచంగిపుట్టు మండలం

వినతులిచ్చినా ప్రయోజనం లేదు



గిరిజన విద్యార్థులకు భవన సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని పాఠశాలలకు భవనాలు లేక పాకలు, రేకుల షెడ్లులోనే చదువులు కోనసాగుతున్నాయి. ముఖ్యంగా వర్షకాలంలో విద్యార్థులు చదువు కొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు.అనేక సార్లు కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి పాఠశాలల భవన సమస్యలను తీసుకెళ్లాం. వినతులన్నీ బుట్టదాఖలయ్యాయి. నేటికి సమస్యలు పరిష్కారం కాలేదు,కూటమి ప్రభుత్వం గిరిజన విద్యపై ఏమాత్రం శ్రద్ధ ఉన్న నిధులు మంజూరు చేసి, పాఠశాలలకు భవన సమస్య తీర్చాలి.

– ఎం.ఎం.శ్రీను, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు, ముంచంగిపుట్టు

ప్రతిపాదనలు పంపాం



మండలంలో 55 బడులకు భవనాలు లేవు.కొన్ని పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి.శిథిలావస్థలో ఉన్న భవనాలల్లో విద్యార్థులకు కూర్చొబెట్టోద్దని ఉపాధ్యాయులకు సూచించాం. భవనాలు లేని ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను గుర్తించాం. భవనాల మరమ్మత్తులు,నూతన భవనాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం

– కె.కృష్ణమూర్తి, ఎంఈవో, ముంచంగిపుట్టు

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

చింతూరు: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి సోడె రాఘవయ్య డిమాండ్ చేశారు. చింతూరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కులను కాలరాస్తూ ఆంధ్రా, తెలంగాణలో లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడం దారుణమన్నారు. వెంటనే వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించి నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు స్థానిక ఆదివాసీలకే కల్పించాలని ఆయన కోరారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి



ఎర్రంరెడ్డినగర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బొజ్జయ్య, వైస్ ఎంపీపీ బాలకృష్ణ

రంపచోడవరం: రంపచోడవరం పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్టు సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. పంచాయతీ పరిధిలోని ఎర్రంరెడ్డి నగర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి రోడ్లు, డ్రైనేజీలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఉప సర్పంచ్ కన్నబాబు, వార్డు సభ్యులు సుధాకర్, వెంకట్రావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు రామన్నదొర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు, పండు, పంచాయతీ కార్యదర్శి కామరాజు పాల్గొన్నారు.

ఉర్లాకులపాడును ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి



చిన్నాలమ్మ

రాజవొమ్మంగి: మండలంలోని ఉర్లాకులపాడు, జి.శరభవరం, కోసూరివారి వీధి తదితర గ్రామాలన్నిటిని కలిపి ఉర్లాకులపాడు పంచాయతీగా ప్రకటించాలని సంబంధిత అధికారులను మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కోసూరి బుజ్జి చిన్నాలమ్మ కోరారు. ఈ గ్రామాలు మారేడుబాక పంచాయతీకి చెందినవి అయినప్పటికి పంచాయతీ కేంద్రంగా మారేడుబాకకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పంచాయతీ కేంద్రం మారేడుబాక వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారన్నారు. మారేడుబాక గ్రామానికి రహదారి, రవాణా సదుపాయాలు లేవన్నారు. ఈ కారణంగా అన్ని ప్రాంతాలకు అనువుగా, దగ్గరగా ఉండే ఉర్లాకులపాడును పంచాయతీ కేంద్రంగా ప్రకటించాలని కోరారు. దీనిపై కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పీఓ. ఎంపీడీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేసినట్టు చెప్పారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



విద్యుత్ లైట్ల వెలుగులో సీలేరు మార్కెట్



కొయ్యూరు కొండపై వెలసిన దుర్గమ్మ

సీలేరు: దసరా ఉత్సవాలకు ఊరువాడ సిద్ధమైంది. సోమవారం నుంచి దసరా నవరాత్రులు ప్రారంభమవుతున్న తరుణంలో సీలేరులో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సీలేరు మార్కెట్ సెంటర్ నలుమూల విద్యుత్ దీపాలతో కళకళాలాడుతుంది. తొమ్మిది రోజులు అమ్మవారికి నిత్య పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేశారు. అనకాపల్లి నుంచి ఎనిమిది అడుగుల అమ్మవారి విగ్రహాన్ని తీసుకొచ్చారు. సీలేరు రెగ్యులేటర్ డ్యామ్ వద్ద అమ్మవారి గరగలను తయారుచేసి గ్రామంలో మీదుగా తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో కొలువు తీర్చారు.

నవరాత్రులకు ముస్తాబవుతున్న ఆలయం

కొయ్యూరు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా దుర్గమ్మవారికి పేరుంది. ఇంద్రకీలాద్రిని పోలి ఉండే కొయ్యూరు కనకదుర్గమ్మ ఆలయాన్ని నవరాత్రులు సందర్భంగా ముస్తాబు చేస్తున్నారు. లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. కొండపైన దుర్గమ్మ ఆలయం ఉంటుంది. ఇది ఇంద్రకీలాద్రిని పోలి ఉంటుంది. దసరా సమయంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తారు. భవానీ మాలలను ధరిస్తారు. ఇరుముడులు అనంతరం వాటిని ఆలయం వద్దనే విడదీస్తారు. పది సంవత్సరాల నుంచి ఇక్కడ దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంతో వివిధ పనుల కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం దసరాకు కొయ్యూరు వస్తారు. ఆలయ కమిటీ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది.

నేటి నుంచి నాటికల ప్రదర్శన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పార్కు సెంట్ గౌరీ సేవా సంఘంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ వరహా నూకరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ వారిచే 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం' పద్య నాటకం, 23న సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన యంగ్ థియేటర్ అర్గనైజేషన్ వారిచే '27వ మైలు రాయి' నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు జిల్లా కైకలూరు సాయి ఆర్ట్స్ వారిచే ' జనరల్ బోగీలు' నాటిక, 24న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన మల్లాది క్రియేషన్స్ వారిచే 'ఆవేశంలో ఆనందం' హాస్య నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు అభినయ్ ఆర్ట్స్ వారిచే 'ఇది అతని సంతకం' నాటిక, 25న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, గోవాడ క్రియేషన్స్ వారిచే 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక, రాత్రి 8 గంటలకు గుంటూరు వారిచే 'నాన్న' నాటిక, 26న సాయంత్రం 6 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారిచే ' విడాకులు కావాలి' నాటిక, రాత్రి 8 గంటలకు విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్ వారిచే 'భువి కోరని భ్రమణం' నాటికలు ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. నాటికల పర్యవేక్షకులుగా నాయుడు, సూరిబాబు వ్యవహరిస్తారన్నారు.

జీవామృతంతో పంటలకు మేలు

అనకాపల్లి: తుమ్మపాలలో రైతులకు జీవామృతం తయారీ విధానంపై ప్రకృతి వ్యవసాయం జిల్లా మార్కెటింగ్ మాస్టర్ అప్పలరాజు అవగాహన కల్పించారు. ప్రతి 15 రోజులు ఒకసారి నీటితో జీవామృతాన్ని పిచికారీ చేయడంతో పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఎటువంటి చీడపీడలు దరి చేరవని, పంట దిగుబడి బాగుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు.

కాఫీ తెగుళ్లపై రైతులకు అవగాహన



సాడికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మాతోట మేనేజర్ గాంధీపడాల్

చింతపల్లి: కాఫీలో వ్యాప్తి చెందే బెర్రిబోరర్ కీటకాన్ని ప్రాథమిక దశలోనే అరికట్టికోవాలని మాతోట రైతు ఉత్పత్తిదారులు సంఘం మేనేజర్ కంకిపాటి గాంధీపడాల్ అన్నారు. ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలో గల సాడిక గ్రామంలో కాఫీ రైతులకు బెర్రిబోరర్ కీటకం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తొలిసారిగా ఈ కీటకం బయటపడిందన్నారు. ఈ కీటకం కాఫీ గింజలను ప్రవేశించి పంటను నాశనం చేస్తుందని, దీంతో పంట దిగుబడులు తగ్గుతాయన్నారు. రైతులు ఈ కీటకం పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కీటక లక్షణాలను గుర్తిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కాఫీ పంటపై ఆశిస్తున్న బెర్రిబోరర్ కీటకంపై చింతపల్లి జీకే వీధి మండలాల్లో రైతులకు మాతోట రైతు ఉత్పత్తిదారులు సంఘం ద్వారా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎఫ్‌పీవో సీఈవో చిన్నారావు పాల్గొన్నారు.

దివ్యాంగ కుటుంబానికి చేయూత



సిరిపురం గ్రామంలో బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసరాలను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చింతపల్లి: మండలంలోని సిరిపురం గ్రామంలో ఒకే కుటుంబంలో పోలియోతో బాధపడుతున్న ముగ్గురు చిన్నారులకు అల్లూరి యూత్ సంఘం ఆధ్వర్యంలో నగదు, నిత్యావసరాలను పంపిణీ చేసినట్టు నిర్వాహకులు పెదపూడి మధుబాబు తెలిపారు. పెదబరడ పంచాయతీ పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన కిలో నాగేశ్వరరావు, గౌరి దంపతులకు ఏడుగురు సంతానం. వారిలో ముగ్గురు చిన్నారులు పోలియోతో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వారి పోషణ తల్లిదండ్రులకు కష్టంగా మారింది. దీంతో గ్రామానికి చెందిన కూడా రామకృష్ణ ఆ నిరుపేద కుటుంబ పరిస్థితిని అల్లూరి యూత్ సంఘం వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన యూత్ సంఘం సభ్యులు దివ్యాంగ బాధిత కుటుంబాన్ని తమ వంతు ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా బాధిత కుటుంబానికి రూ.30 వేల నగదు, నిత్యావసరాలను వారికి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.ఈ కుటుంబంలో పోలియోతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సహాయం అందించడానికి దాతలు ముందుకు రావాలని వారు కోరారు. సంఘ సభ్యుడు జన సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ





చుట్టమెట్టలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సూరిబాబుని, జి.మాడుగులలో మంగమ్మను పరామర్శిస్తున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.మాడుగుల: మండలంలో చుట్టుమెట్ట గ్రామంలో కొద్దిరోజులగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగృహానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్రా సూరిబాబు, జి.మాడుగుల రామకోవెల వీధిలో అనారోగ్యంతో ఉన్న ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి అత్త మంగమ్మని ఆదివారం పాడేరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. ఇద్దరి ఆరోగ్యంపై ఆమె ఆరా తీశారు. సూరిబాబు, మంగమ్మ త్వరగా కోలువాలని ఆమె ఆకాంక్షించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, ఏఎంసీ మాజీ చైర్మపర్సన్ గాయత్రి, మాజీ డైరెక్టర్ బాబూరావు, వార్డు సభ్యుడు మణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, రాంబాబు, మాలన్న తదితరలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రాజవొమ్మంగిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట జాతీయ రహదారిపై పోలీసులు ఆదివారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో గ్రామంలోకి వస్తున్న కొత్తవారిని ప్రశ్నించి వదిలిపెట్టామని ఎస్ఐ టి.శివకుమార్ విలేకరులతో అన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి హెల్మెట్ లేకుండా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని. జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోవాలి



కుంజా శ్రీను

రంపచోడవరం: రంపచోడవరంలో అక్రమ కట్టడాలు నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రంపచోడవరం మండల కేంద్రంలో గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారన్నారు. రంపచోడవరంలో అనేక అక్రమ కట్టడాలు తొలగించినప్పటికి అధికారుల నిర్లక్ష్యం వలన యథావిధిగా నిర్మాణాలు జరగుతున్నాయని ఆరోపించారు. రంపచోడవరం ప్రధాన రహదారి పక్కన ఒక గిరిజనేతరుడు అక్రమ నిర్మాణం చేస్తున్నట్టు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, శనివారం రాత్రికి రాత్రే శ్లాబ్ నిర్మాణం జరిగిందని ఆరోపించారు. దీనిపై కలెక్టర్, స్థానిక సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఏజెన్సీలో 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.